నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి


హైదరాబాద్, శుక్రవారం 13 జూన్ 2025 RANGAREDDY




ఇబ్బందుల్లో విద్యార్థినులు

## చిన్నపాటి వర్షం.. మడుగును తలపించిన పాఠశాల ప్రాంగణం

చేవెళ్ల టౌన్, జూన్ 12 : వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. అయితే గురువారం ఉదయం కురిసిన చిన్నపాటి వానకు చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల గేటు ఎదుట నీళ్లు నిలిచి చిన్న మడుగును తలపించింది. స్కూల్‌లోకి వెళ్లేందుకు మరో దారి లేక విద్యార్థినులు ఆ నీళ్ల నుంచే నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. అధికారులు స్పందించి పాఠశాల ఎదుట వర్షపు నీరు నిలువకుండా మట్టి పోయించాలని స్టూడెంట్స్, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



## మూడు రోజులు భగీరథ నీళ్లు బంద్

చేవెళ్ల రూరల్, జూన్ 12 : నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి మండలాలకు మూడు రోజులపాటు మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) చల్మా రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతారం వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్‌లోని క్లియర్ వాటర్ (సీఎల్ఎఫ్) చాంబర్‌గేట్ వాల్వ్ ఫెయిల్యూర్ కావడంతో మరమ్మతులు జరుగుతున్నాయని.. ఈ కారణం గానే ప్లాంట్‌లో రా వాటర్ సరఫరాను తాత్కాలికంగా నిలిపేసినట్లు ఆయన తెలిపారు. అంతారం నుంచి నాగర్‌గూడ వరకు ఉన్న 900 ఎంఎం డీఐపీ పైపులైన్‌లో లీకేజీ సమస్య తలెత్తడంతో దాని రిపేరింగ్ కూడా జరుగుతున్నదని.. ఈ పనులు పూర్తయ్యే వరకు నీటి సరఫరా ఉండదన్నారు. అందుకోసం మున్సిపల్ కమిషనర్లు, స్పెషల్ ఆఫీసర్లు, గ్రామ సెక్రటరీలు జూన్ 13 నుంచి 15 వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజలు కూడా నీటిని పొదుపుగా వినియోగించి.. అధికారులకు సహకరించాలన్నారు.

# రెవెన్యూ దందా!

## 'గుడ్‌విల్' ఇస్తేనే రిజిస్ట్రేషన్లు..!

### భూముల రిజిస్ట్రేషన్లకు తహసీల్దార్ల వసూళ్లు..!

- రిజిస్ట్రేషన్ పూర్తైన వెంటనే గుడ్‌విల్ ఇవ్వాల్సిందే
- డబ్బులు ముట్టజెప్పితేనే రిజిస్ట్రేషన్ పూర్తైన పత్రాలు అందజేస్తున్న అవినీతి అధికారులు
- ఒక్కో మండలంలో ఒక్కో రేట్ ఫిక్స్ చేసిమరీ వసూళ్లు
- పూడూరు, పరిగి, వికారాబాద్ రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై ఆరోపణలు
- త్వరలో పలువురిపై వేటు పడే అవకాశం
- భూభారతి దరఖాస్తుల రిపోర్టులూ పంపేందుకు చేతులు తడపాల్సిందే..
- అందినకాడికి దోచుకుంటున్న రెవెన్యూ అధికారులు

అవినీతి అధికారులపై వికారాబాద్ కలెక్టర్ సీరియస్

వికారాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : రెవెన్యూ శాఖలో కొందరు అధికారులు బరితెగిస్తున్నారు. పలు రెవెన్యూ కార్యాలయాల్లో ఒక్కో పనికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. అంతేకాదు ధరణి ఆపరేటర్, ఆర్ఐ నుంచి తహసీల్దార్ వరకు ఒక్కో స్థాయిలో వారు అడిగినంత ఇస్తేనే ఫైల్ ముందుకు కదులుతుంది.. లేదంటే ఏదో ఒక కొర్రీ పెట్టి పెండింగ్‌లోనే పెడుతున్నారు. అయితే భూసమస్యలకు సంబంధించి రిపోర్టు ఇచ్చే పని మొదలుకొని భూముల రిజిస్ట్రేషన్ల వరకు అందినకాడికి దండుకుంటున్నట్లు తహసీల్దార్లపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుక్ చేసుకుంటే సంబంధిత రెవెన్యూ అధికారులకు డబ్బులు ముట్టజెప్పడం తప్పనిసరిగా మారింది !. రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే భూమిని కొన్న పట్టాదారును కొందరు తహసీల్దార్లు నేరుగా డబ్బులు డిమాండ్ చేస్తుండగా.. మరికొందరు ధరణి ఆపరేటర్ల ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. అయితే ఈ వసూళ్లకు గుడ్‌విల్ అంటూ పేరు పెట్టి దండుకుంటున్నారని మండిపడుతున్నారు. రిజిస్ట్రేషన్ పూర్తి కాగానే గుడ్‌విల్ ముట్టజెప్పాలంటూ పలు మండలాల రెవెన్యూ యంత్రాంగం నిబంధన పెట్టడం గమనార్హం. కాగా, ఒక్కో మండలంలో ఒక్కో రేట్ ఫిక్స్ చేసి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలున్నాయి. డబ్బులిస్తేనే రిజిస్ట్రేషన్ పూర్తైన పత్రాలను అందజేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. మరోవైపు జిల్లాలోని పూడూరు, పరిగి, వికారాబాద్ మండలాల రెవెన్యూ అధికారులు, సిబ్బంది వసూళ్లకు సంబంధించి పలువురు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కాగా, తహసీల్దార్ల వసూళ్ల బాగోతంపై కలెక్టర్ ప్రతీక్ జైన్ సీరియస్‌గా ఉన్నట్లు.. త్వరలోనే పలువురిపై బదిలీ వేటు వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఓ ఎమ్మెల్యే అండదండలతో జిల్లా కేంద్రానికి సమీప మండలంలో పనిచేస్తున్న ఓ తహసీల్దార్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ.. ఉన్నతాధికారుల ఆదేశాలను కూడా పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. డబ్బులు వసూలు చేస్తూ ప్రజలను పీడిస్తున్న అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు ఉన్నతాధికారులను కోరుతున్నారు.




ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే 'ప్రజావాణి'లో భూబాధితుల వినతులను కలెక్టర్ రెకమండ్ చేసినా పలు మండలాల రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు న్నాయి. కలెక్టర్ చెప్పినా బాహాటంగానే డబ్బులు డిమాండ్ చేస్తున్నారని.. డబ్బులిస్తేనే తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫైల్ కదులుతుందని.. లేకుంటే తప్పుగా ఎంట్రీ చేసి ఇబ్బందుల పాలు చేస్తున్నారని పలువురు మండిపడుతున్నా రు. ఆర్డీవో,

### రిపోర్టు పంపేందుకూ చేతులు తడపాల్సిందే..!

పలువురు తహసీల్దార్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులు తమ సమస్య లు పరిష్కారం కాకపోవడంతో కలెక్టరేట్ చుట్టూ నెలల తరబడి ప్రదక్షిణలు చేస్తున్నారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో మండల రెవెన్యూ యంత్రాంగం రిపోర్టు తప్పనిసరి కావడంతో ఇదే అదునుగా అధికారులు అందిన కాడికి దోచుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రానికి దగ్గర్లోని మండలాల్లో అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో ధరణి దరఖాస్తుల పరిష్కారం వెంటనే పూర్తి అవుతున్నా తహసీల్దార్ కార్యాలయాల్లో మాత్రం కావాలనే పెండింగ్‌లో పెడుతున్నారని పేర్కొంటున్నారు. కలెక్టర్‌కు అందజేసే రిపోర్టుకు ఎకరానికి రూ.10-20 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇదేంటని ప్రశ్నిస్తే ఫైల్ కనపడని పరిస్థితి పలు మండలాల్లో ఉన్నదని సమాచారం.

## ఆదర్శం.. ఈ టీచర్

### తన పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించిన హెడ్మాస్టర్ రమేశ్



వికారాబాద్, జూన్ 12 : ఓ హెడ్మాస్టర్.. తన ఇద్దరు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలిచారు. మోమిన్‌పేట మండలంలోని ఎన్కతల ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న దండు రమేశ్ గురువారం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో తన ఇద్దరు పిల్లలు.. దండు అశ్వితను ఐదోతరగతిలో.. దండు సాయినిహంత్‌ను రెండో తరగతిలో జాయిన్ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతున్నదన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను సర్కారు బడికి పంపించాలన్నారు.



# రిసార్టుల్లో నిషా.. కరువైన నిఘా

- విచ్చలవిడిగా మద్యం, గంజాయి, డ్రగ్స్ వినియోగం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా రిసార్టులు
- అధికారుల నిఘా వైఫల్యం.. రెచ్చిపోతున్న మందుబాబులు

రంగారెడ్డి, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని రిసార్టులు అక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి. అందులో సంఘ వ్యతిరేక కార్యక్రమాలతోపాటు గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే వేలాదిగా ఉండగా.. ఇటీవల మళ్లీ కొన్ని వెలిశాయి. రాత్రయితే చాలు రిసార్టుల్లో డీజేల మోతలు వినిపిస్తున్నాయి. మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటివి ఏరులై పారుతున్నాయి. అధికారులు, పోలీసుల నిఘా కొరవడడంతో అసాంఘిక కార్యక్రమాలు పెరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి.

### వీకెండ్ పార్టీలతో హోరెత్తుతూ..

జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, సరూర్‌నగర్, బాలాపూర్, హయత్‌నగర్, రాజేంద్రనగర్, శంషాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, చేవెళ్ల, షాద్‌నగర్, కందుకూరు, కొత్తూరు, కేశంపేట, తలకొండపల్లి, తుక్కుగూడ వంటి ప్రాంతాల్లో అధిక సంఖ్యలో రిసార్టులున్నాయి. వీటిలో శని, ఆదివారాల్లో పెద్ద ఎత్తున వీకెండ్ పార్టీలు జరుగుతున్నాయి. బర్త్‌డే, గెట్ టు గెదర్, వివిధ ఐటీ పరిశ్రమలు, కంపెనీలకు చెందిన పార్టీలు, శుభకార్యాలకు సంబంధించినవి అధికంగా నిర్వహిస్తున్నారు. ఈ పార్టీలకు డీజేలు, విదేశీ మద్యాన్ని ఎలాంటి అనుమతుల్లేకుండా వినియోగిస్తున్నారు. మద్యం మత్తులో అసాంఘిక కార్యక్రమాలూ జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి.

### శుభకార్యాల ముసుగులో మద్యం, గంజాయి, డ్రగ్స్ పార్టీలు..

జిల్లాలోని శివారు ప్రాంతాల్లో అధిక సంఖ్యలో రిసార్టులుండడంతో యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున వీకెండ్ పార్టీల పేరుతో మద్యం, గంజాయి, డ్రగ్స్‌ను తీసుకుంటున్నారు. పుట్టినరోజు వేడుకలు, నూతన వస్త్రాలంకరణ, పూర్వ విద్యార్థుల సమ్మేళనం, గెట్ టుగెదర్ వంటి వాటిని పెద్ద ఎత్తున నిర్వహిస్తూ వాటి పేరుతో మద్యం, గంజాయి, డ్రగ్స్ పార్టీలు చేసుకుంటున్నారు. అలాగే, రేవ్ పార్టీలూ నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్ మున్సిపాలిటీలతోపాటు మంచాల మండలంలోని ఆరుట్ల, పీసీతండా, బోడకొండ, లోయపల్లి, యాచారం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటైన రిసార్టుల్లో యువత వీకెండ్‌లో జల్సాలు చేసుకునేందుకు అద్దెకు ఇస్తున్నారు. వీటిపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు.. వాటి నిర్వాహకులు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

### పెద్ద ఎత్తున విదేశీ మద్యం స్వాధీనం

గత 15 రోజుల్లో జిల్లాలోని శంకర్‌పల్లి, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల్లోని పలు రిసార్టుల్లో ఎస్‌వోటీ పోలీసులు మూడు రేవ్‌పార్టీలను భగ్నం చేశారు. ఈ పార్టీల్లో పెద్ద ఎత్తున విదేశీ మద్యం, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని.. వాటి నిర్వాహకులపై కేసులు నమోదు చేసినా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. రిసార్టుల్లో అత్యధిక శాతం ఇలాంటి కార్యక్రమాలే జరుగుతున్నాయి.

## చితికిపోతున్న చిరు వ్యాపారులు

### నగరంలో ఆన్‌లైన్ యాప్‌లు, మాల్‌ల దెబ్బకు వీధి వ్యాపారులు కుదేలు

సిటీ బ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : వీధి వ్యాపారులు, చిన్న చిన్న షాపులు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకునే వారి పాలిట క్విక్ కామర్స్ డెలివరీ సంస్థలు, షాపింగ్‌మాల్స్, సూపర్ మార్కెట్లు శాపంగా మారుతున్నాయి. ఆన్‌లైన్ డెలివరీలు, డిస్కౌంట్లతో మాల్స్, క్విక్ కామర్స్ సంస్థలు చూపే ఆశలతో కొనుగోళ్లు తగ్గిపోయి రోడ్లపై, కాలనీల్లోని ఉండే పండ్లు, కూరగాయలు, కిరాణా షాపులు వెలవెలబోతున్నాయి. పుట్టగొడుగుల్లా వెలుస్తూ చిరు వ్యాపారులకు ఉపాధి లేకుండా చేస్తున్నాయి. దీంతో హైదరాబాద్ నగరంలో చిరు వ్యాపారాలపైనే ఆధారపడి జీవించే వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అమ్మకాలు తగ్గడంతో కుటుంబ పోషణ కూడా భారంగా మారుతున్నదని వీధి వ్యాపారులు, చిన్న చిన్న షాపులదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడిచిన మూడేండ్లుగా షాపుల అద్దెలూ చెల్లించలేని దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. నగరంలో కరోనా మహమ్మారి సృష్టించిన అలజడికి ఇంటి అద్దెలతోపాటు అన్ని వస్తువుల ధరలు అమాంతం పెరిగాయి. ఆన్‌లైన్ సేవలు విస్తృతం కావడంతో అన్నింట్లోకి క్విక్ కామర్స్ సంస్థల డెలివరీ విధానం వచ్చింది. దీంతో పండ్లు, కూరగాయలు, పాల ప్యాకెట్ల నుంచి మాంసం ఉత్పత్తుల దాకా అన్నీ ఆన్‌లైన్ బుకింగ్స్‌తో ఇంటి వద్దకే చేరుతున్నాయి. దీని ప్రభావం వీధి వ్యాపారాలు, కిరాణా షాపులపై తీవ్రంగా పడింది.

### వెలవెలబోతున్న వారాంతపు సంతలు

ఆన్‌లైన్ క్విక్ కామర్స్ యాప్‌లు వచ్చిన తర్వాత ప్రజలు తోపుడు బండ్లు, రోడ్ల వెంట ఉండే చిన్నచిన్న పండ్లు, టిఫిన్ బండ్లు, కూరగాయలు, కిరాణా షాపులు, వారాంతపు సంతలకు వెళ్లడం పూర్తిగా తగ్గించేశారు. రద్దీగా ఉండే కాలనీల్లో ఏర్పాటు చేస్తున్న వారాంతపు సంతలు వెలవెలబోతున్నాయి. పండ్లు, కూరగాయలు, నిత్యావసర సరుకులను ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే ఇండ్లకు చేరుతుండడంతో ఆన్‌లైన్ విధానం వైపే మొగ్గు చూపుతున్నారు. బయట దొరికేదాని కంటే తక్కువకే వస్తుండడంతో ప్రజలు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసేందుకే మొగ్గు చూపుతున్నారు. మరోవైపు తొలిసారి బుక్ చేసుకుంటే క్యాష్ బ్యాక్, ప్రత్యేక ఆఫర్లను అందిస్తుండడంతో వినియోగదారులు క్విక్ కామర్స్ యాప్‌లకు ఆకర్షితులవుతున్నారు. ధరలూ అందుబాటులో ఉండడం, సమయం ఆదా అవుతుండడంతో బయట కొనాల్సిన అవసరం ఉండదని వినియోగదారులు భావిస్తున్నా రు.

### డిస్కౌంట్లతో ఆకట్టుకుంటూ..

సూపర్ మార్కెట్లలో నిత్యావసర సరుకులు, కూరగాయలు, పండ్లు, ఇతర వస్తువులు డిస్కౌంట్లకు తక్కువ ధరకు లభిస్తాయనే భావనతో వినియోగదారులు నెలకు సరిపడా తీసుకునేందుకు వాటిపైనే ఆధారపడుతున్నారు. అదేవిధంగా కిరాణా, కూరగాయలు, పండ్లతోపాటు పాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, గృహోపకరణాలన్నీ సూపర్ మార్కెట్లలో ఉండడంతో అన్ని వస్తువులు ఒకే దగ్గర, ఒకేసారి తీసుకోవచ్చునని వాటివైపే మొగ్గు చూపుతున్నారు. మాల్స్, సూపర్ మార్కెట్లలో ఆఫర్లు ఉంటుండడం కూడా వినియోగదారులు ఆకర్షితులవుతున్నారు.

### కొరవడిన నాణ్యత

ఆన్‌లైన్ ఆర్డర్లకు పెరుగుతున్న విపరీతమైన డిమాండ్‌ను క్విక్ కామర్స్ సంస్థలు క్యాష్ చేసుకుంటున్నాయి. నాణ్యత లేని సరుకులు, కూరగాయలను సరఫరా చేస్తూ వినియోగదారుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఇటీవల ముంబై నగరంలోని జెప్టో గోడౌన్ డంపింగ్ యార్డులా దర్శనమివ్వడమే దీనికి నిదర్శనం. బూజుపట్టిన ఆహార పదార్థాలు, కుళ్లిన కూరగాయలను ప్రజలకు సరఫరా చేస్తుండటాన్ని అక్కడి అధికారులు బట్టబయలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లోనూ పలు హోటళ్లు, మాల్స్‌లో శుభ్రత లోపించిన ఆహారపదార్థాలు పట్టుబడుతున్నాయి.

## జుంటుపల్లి రైతులకు న్యాయం చేయాలి

- కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్

వికారాబాద్, జూన్ 12 : కొనుగోలు కేంద్రాల్లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ మండిపడ్డారు. గురువా రం ఆయన జుంటుపల్లి రైతులతో కలిసి కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. స్పందించిన కలెక్టర్.. అక్కడికొచ్చిన రైతులతో మాట్లాడి న్యాయం చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా సివిల్ సప్లై అధికారిని ఆదేశించారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి వారం రోజుల్లో రైతులకు న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ .. ధాన్యాన్ని అడ్డికి పావు శేరు లెక్క కొంటున్నారని మండిపడ్డారు. తరుగు పేరుతో అన్నదాతను మోసం చేస్తున్నారని ..41 కిలోల కాంటాకు బదులు 43 కిలోలు తీసుకోవడమే కాకుండా.. రైస్‌మిల్లర్లు కూడా 50 బస్తాలు ఉన్న రైతు దగ్గర రెండు బస్తాలు, 70 బస్తాలుంటే 3 బస్తాలు, 100 బస్తాలకు 5 బస్తాలు, 150 బస్తాలకు 8 బస్తాలు కట్ చేయడం సరికాదని హెచ్చరించారు. మాది రైతు ప్రభుత్వం అని గొప్ప లు చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి అన్నదాత బాధ లు కనిపించడం లేదా..? అని ప్రశ్నించారు. వారం రోజుల్లో రైతులకు న్యాయం జరుగకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జుంటుపల్లి బాధిత రైతులు రాంచందర్, శాంతప్ప, గోవర్ధన్‌గౌడ్, సోను, గోవింద్, బీఆర్‌ఎస్ నాయకులు రవిశంకర్, సిద్ధిఖ్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలు వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు వివరిస్తున్న బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్